# 15

# అడవిలో వెన్నెల

వర్షం కురిసి కురిసి ఆ రోజు ఉదయాన్నే తెరిపియిచ్చింది. పత్తి చేను గాలికి కదులుతున్నట్లుంది.

గాలికి టేకు ఆకులు కదలాడాయి. ఏనుగు చెవుల్లాంటి ఆ ఆకుల మొరటు నారలలో అంటుకొని ఆగిపోయిన చినుకులు తుంపరగా రాలుతున్నాయి.

ఏపుగా పెరిగిన పచ్చగడ్డిలో రాలిన చినుకులు గడ్డిపోసలపై అమరిన ముత్యాల్లా మెరుస్తున్నాయి. అందమైన ప్రకృతి దృశ్యాల మధ్యపడుకొన్న పెద్ద మేకలు లేచి నిలబడి ఒల్లువిరుచుకున్నాయి. పిల్లమేకలు తల్లిపొదుగు చేరాయి. వాటికి వెచ్చదనం కోసం కింద పరచిన ఎండుటాకులు వాటికాళ్ళ తొక్కిడికి చిందర వందరైపోయాయి.

పక్కనే ఉన్న నెగడు మండి మండి నివురుగప్పుతుంది. కొరుకులు ఇంకా చల్లారలేదు. పిల్లమేక ఒకటి తల్లి పొదుగు కోసం చెంగవేయడంతో ఇంకా చల్లారని కొరుకుపై కాలు పడి మిర్రకొట్టి 'మే' అని అరిచింది. ఒకటి తరువాత ఒకటి మరిచిపోయిన అరుపును తిరిగి అపుడే నేర్చుకున్నట్టుగా లయగా 'మే' అంటూ అరవడంతో ఉలిక్కిపడి లేచాడు యిస్రూ తలండి. ప్రక్కనే నిద్ర పోతున్న కూతురు మోతీ కప్పుకున్న పాతగుడ్డను సరిచేశాడు.

మంచం లోంచి లేచి ఒళ్ళు విరుచుకున్నాడు. మేకల పాకవైపు దృష్టి సారించాడు. చెల్లాచెదరయిన కొరుకుల్ని సరిచేశాడు. మరో మంచంలో గాఢనిద్రపోతున్న కొడుకువేపు చూశాడు.

ఇపుడిపుడే జొన్నకంకి పాలు పోస్తోంది. ఇప్పటినుంచి పంట యింటి కొచ్చేదాకా మరింత జాగ్రత్తగా కాపలా కాయాలి. అర్ధరాత్రి దాకా తాను కాపలా కాసాక ఏసుని నిద్రనించి లేపి కాపలా వుండమని తాను పడుకున్నాడు. తాను లేవక ముందే వీడు గుర్రు కొడుతున్నాడు. మేకలను పక్క పాకలోనే కట్టేసినా

వాటి వాసనకు వచ్చి పులిగొడ్తె? ఎలుగుబంట్లు, ఏదులు జొన్నకర్రలు పీక్కుపోతే? ఛ! వీడికి వయసు వచ్చినా బాధ్యత గుర్తెరగడం లేదు!

వీడికి బాధ్యత తెలిసిరావడానికి ఏంచేయాలి! ఆఁ! వీడికి పెళ్ళి చేస్తే సరి! వేరు గుడిసె, వేరు సంసారం, వేరు వ్యవసాయం! అపుడుగాని వీడికి బుద్ధి రాదు.

అవునూ! వీడు మహువా (విప్ప) పూలు ఏరడానికి తన వెంట వచ్చినట్టేవచ్చి ఎక్కడో తప్పదీస్తాడు. వెతగ్గా వెతగ్గా లకింబాయి పక్కన నవ్వుతూ కనపడతాడు. తనని చూడగానే ఏమీ ఎరగనట్టు తన వెంట వచ్చేస్తాడు. నాకు తెలీదనుకుంటాడేమో వీడు!

లకింబాయి చూడ చక్కని పిల్ల. కనుబొమ్మలమీదా, నొసట్లలోనూ, చెంపలమీదా, గదువు మీదా, మెడ కిందా పొడిపించుకున్న చుక్కబొట్లు ఆ చక్కదనాన్ని చిక్కబరుస్తున్నాయి.

అది ఈ నడుమ జాకెట్లు వేస్తూంది. వీనికి తగిన పిల్ల. లకింబాయి తమ 'యిల్లుచొచ్చి' వీడి పెళ్లామైతే బాబూరావు మడెతో ఎంత లడాయి అవుతుందో!

బాబూరావు మడె కొంత కలిగినవాడు. రెండు జతల దున్నపోతుల వ్యవసాయం. ఇటీవల ఎదిగిన కోడెదూడల్నిచ్చి రెండు పోతుల్ని తీసుకున్నాడు.

పశువులంగడికి పోయినపుడు ఆ బేరగాళ్ళు కోడెదూడల్ని చూసి నాకంటె నాకని కొట్లాడుకు ఛస్తారు. వీటికి బదులుగా యిచ్చే దున్నపోతులు మావి చూడండి అని ఒకడటూ, ఒకడిటూ గుంజుకుపోతారు. కోడెల్ని తీసుకుని దున్నపోతుల్ని యిస్తే వాళ్లకి ఏం లాభమొస్తుంది? తనకైతే దున్నపోతులే నయం అనిపిస్తుంది. అందుకే బాబూరావు మడె కోడెదూడల పీడ వదిలించుకుని మాంచి బలిసిన దున్నపోతుల్ని తీసుకు వచ్చాడు.

బాబూరావు మడెకు పదిదాకా మేకలున్నాయి. రెండకరాలు వరి పండే పొలం కూడా ఉంది. వాళ్ళ గూడెంలో నాందేవ్ గాయికల్ (పెద్ద) తర్వాత అంతటివాడు.

తమకేం ఉందీ! ఈ జొన్నచేనూ, వులవలు పండే మరో ఎకరం తప్ప! అయిదు మేకలైతే వున్నయి. పంట కోతకు ముందు జరుపుకునే పండుగకు ఒకటి ఎలాగూ తెగుతుంది. దసరాకు అహిరి మహారాజ్‌కు ఒకటి ఎలాగూ

సమర్పించుకోవాలి. ఫారెస్టు అధికారుల కన్నుబడ్డా, ఎలుగుబంట్ల కన్నుబడ్డా వాటి బతుకు కుప్పకూలిపోవడానికి ఎంతో సమయం అవసరంలేదు.

కళ్ళు నులుముకుంటూ మోతీ లేచింది. మోతీకి చుక్కబొట్లు పొడిపించాలి. ముఖమంతా చుక్కబొట్లు పొడిపిస్తే ఎంత చక్కగా వుంటుంది! చేతి మీద కూడా చుక్కబొట్టు పొడిపించాలి. లేకపోతే దీన్ని ఎవరు పెళ్ళాడతారు ?

పాక బయట నిలబడి ఒళ్ళు విరుసుకున్నాడు యిస్రూ. ప్రాణంతో సమంగా చూసుకుంటున్న జొన్న చేనువేపు చూశాడు.

జొన్నచేను ఏపుగా పచ్చగా పెరిగి కంకివేసింది. కంకి ఇపుడే పాలు పోసుకుంటున్నది. జొన్న కర్రలు వర్షంలో తడవడంతో కడిగినట్టు మరింత పచ్చబారి కనిపిస్తున్నాయి. కర్రలో అక్కడక్కడా నిలిచిన నీటి చుక్కలు నీటిలో మెరిసే చందమామ చేపల్లా కనిపిస్తున్నాయి.

ఇస్రూకు చేపలంటే నోరూరింది. వర్షం బాగానే పడింది. మడుగులు బాగానే పారుతున్నాయి. ఆ మడుగులో బాగానే దొరకవచ్చు. ఈ రోజు ఎలాగైనా చేపలు పట్టుకురావాలి.

చలి చలిగా వున్న దేంటివాళ! వేడివేడి జొన్నంబలి తాగుతూ అంచుకు కాల్చిన చేపలు కొరుక్కుతింటుంటే... ఓహ్! ఎంత కమ్మగా ఉంటుంది.

తనని చేపలవేటకాడు అంటారు. ఆ మాటకొస్తే తమ గూడాలలో చేపలు, మాంసం, సారా, పండుగు అంటే ఇష్టపడని వాళ్ళెవ్వరు ? దొరికితే రోజూ తిందామనే ఉంటుంది.

చేపలంటే జ్ఞాపకంవచ్చింది. ఓసారి చిన్న తనంలో ఏంజరిగింది? అపుడు గూడెం ఇక్కడ ఉండేది కాదు. ఇక్కడికి తూర్పు దిక్కున వుండేది. పక్కనే ప్రాణహిత నది ప్రవహిస్తు ఉండేది.

చుట్టూ దట్టమైన అడవి. యిప్పటివలె అప్పుడు పచ్చిక బయళ్ళు కానీ, అడవి లేని ప్రదేశం కానీ కన్పించేది కాదు. ఎటు చూసిన చూపు ఆనినంత మేర అడవే.

అపుడు తమకు యెంత పెద్ద మేకలమంద వుండేదీ! ఆరోజు మేకలకు నీళ్ళు తాగించబోయి చేపలు కనబడితే వాటిని పట్టుకుంటూ సంతోషంతో మైమరిచి

పోయాడు. మేకలు అడవిలో పడ్డాయి. ఫారెస్టు అధికార్ల కంటబడ్డాయి. మందకు మంద కొట్టుకపోయి కట్టేసుకున్నారు వాళ్ళు. తన తండ్రి పోయి కాళ్లు మొక్కినా వదల్లేదు. చివరకు నాలుగు ప్రాణం బట్టిన మేకల్ని దండుగ కింద లాక్కొని మిగతావి దయతో వదిలిపెట్టారు.

మేకలు జ్ఞప్తికిరాగానే 'మోతీ! మేకలు జాగ్రత్త!' అని హెచ్చరించాడు.

వీడింకైనా లేస్తాడా అని కొడుకు వేపు చూశాడు. యిస్రు మంచానికి తన వేపు వంకలు తిరుగుతూ నిటారుగా పొడుచుకొచ్చిన దుప్పికొమ్ముల పంగని కిరీటంగా కట్టుకున్నాడు. దానికి జింక తోలు అమర్చాడు. దుప్పి కొమ్ముకు అడవి సొరకాయి బుర్ర వేలాడుతోంది.

"అరె! సొరకాయ బుర్రమరిచేపోయాను." అని సొరకాయ బుర్రని తీసుకున్నాడు యిస్రూ. మోతీని మరోసారి హెచ్చరించి బయటకు నడిచాడు.

చుట్టూ అడవి. అడవిలో జొన్నచేను. చేను మధ్యలో ఒక పాక. ఆ పాక నానుకొని మేకలపాక. రెండు పాకల మధ్య నెగడు.

ఆ పాకలో రెండు మంచాలు. నాలుగు పంగ కర్రల్ని పాతి పంగలలో మంచం పట్టెల్లా వాసాలు వేసి కదిలిపోకుండా మోదుగునారతో కట్టారు. వాటిపై సన్నని కర్రలు పేర్చి నారతో కదలకుండా కట్టారు. దానిపై వాడిపోయినగడ్డి. గడ్డి మీద చిరిగిపోయిన పాతపంచె, ఆ మంచం కింద అంబలి కాసే కుండలు.

ఆ పాక వాసానికి జొన్నగడుక మూట ఉట్టిలా వేలాడుతోంది. అడవి గడ్డి కప్పిన ఆ పాక ఏకాంతంగా ఉంది. అక్కడికి కూత పెట్టుదూరంలో మరొకరి చేను. అందులో యిలాంటి మరొక పాక.

రెండు మైళ్ళు పరిధిలో పాకలు వేసికొని ఆ చేనుల్లో కాపలా ఉంటున్న వాళ్ళదంతా ఒకే గూడెం. వాళ్ళ గూడెం ఈ చేన్లకు మధ్యలో కేంద్రంలా వుంటుంది.

ఏడాదికి ఆరునెలలకు పైగా ఆ గూడెం నిర్మానుష్యంగా ఉంటుంది. ఎవరి పంట కాపలా కోసం వారు అలా ఆర్నెల్లకుపైగా ఆ పాకలలోనే ఉండాల్సి ఉంటుంది.

అలా రెండుమైళ్ళ దూరంలోనే మరోగూడెం ఉంటుంది. పది పన్నెండు కిలోమీటర్ల పరిధిలో అలా ఎనిమిది గూడాల దాకా ఉన్నాయి.

అడవితల్లి ఒడిలో అమాయకంగా పెరుగుతున్న అడవిపుత్రులు గోండులలో యిస్రూ కుటుంబం ఒకటి.

సూర్యుడు తూర్పు కొండలలోంచి అపుడే తొంగి చూస్తున్నట్టున్నాడు. మట్టిపెనం మీద దోరగా కాల్చిన జొన్నరొట్టెలా ఆకాశం వెచ్చగావుంది. ఆరబోసిన విప్పపూల వాసనలా వెలుగు వ్యాపిస్తోంది.

అదిగో! ఎంత మబ్బుపడ్డా తూర్పు కొండలలోని పెద్దదేవునికి క్రమం తప్పకుండా దండంబెడుతోంది పొద్దు. మనసులోనే తానూ పెద్దదేవునికి మొక్కుకున్నాడు యిస్రూ.

అలివి అయిన బాటలో ముందుకు నడుస్తున్నాడు యిస్రూ. ఏపుగా పెరిగిన గడ్డిలో కొత్తవాళ్ళకు తొవ్వే తెలియదు. అలవాటుగా నడుస్తున్న కాలుకు కసుక్కున దిగబడింది.

కత్తిలా మొనదేరిన రాయి ఇదివరలో రెండుసార్లు యిస్రూకు పుండుకు గుచ్చుకోవడంతో ఇస్రూ కోపంగా దాన్ని పెరికివేశాడు. అక్కడ కూరిన కొత్త మట్టిలో ఎడంకాలి కింది పుండు కూరుకుపోయింది. మట్టిలోని చిన్నచిన్న రాళ్ళు కుచ్చుకుపోయి విలవిలలాడి పోయాడు. మెల్లిగా ఎత్తి మట్టికాలుతోనే అడుగు ముందుకేశాడు. పుండు సలుపుతోంది.

అది (భార్య) ఈ పుండుతోనే పోయింది. ఈ చలికాలం వస్తే సరిగ్గా మూడేళ్లవుతుంది.

మూడేళ్ళ క్రితం వచ్చిన చలికాలం ఇలా చాలా మందిని తీసుకుపోయింది. పండిన పత్తికాయ పగిలినట్టు, ఎండకేసిన బొంగు నెర్రె లిచ్చినట్టు, చల్లని చలికి శరీరం పట్టున పగిలే చలికాలం.

ఆడవాళ్ళు మోకాలిపైనించి చుట్టుకున్న చీర ఛాతీ మీంచి కొంగులా వేలాడేసుకోవడంతో శరీరం మీద మరే ఆచ్ఛాదనా లేక చలికి పగిలి పుండును రంపంతో కోస్తున్న బాధ.

పదిహేను రోజుల్నుంచి జ్వరంతో ఒళ్ళు నెగడులా మండుతున్న సమయంలోనే దానికి బహిష్టు రావాలా ! ఇక తప్పలేదు. ఎప్పటిలాగే బహిష్టు అయ్యాక వేరే పాకలో ఉంది. గిరిజన స్త్రీలు నెలసరికి ప్రత్యేకమైన పాకలో చేరతారు.

వున్నవే మూడు ముతక గుడ్డలు. కుండెడు తేనె పుచ్చుకుని షావుకారు యిచ్చిన రెండు చద్దర్లు ముడ్డిపంచెలా పల్చగా ఉన్నాయి. అలాంటివి ఎన్ని కప్పినా ఆ చలిజ్వరం ఆగదు. రెండు పల్చటి చద్దర్లకు ఆగుతుందా ! ఇంట్లోకి రావాల్సిన నాల్గోరోజు వుదయాన అది కట్టెలో కట్టె అయిపోయింది.

ఏ రాత్రి పోయిందో, రాత్రి చలికి అది ఎంత విలవిలాలాడిందో ! ఎంతో దిట్టంగా వుండేది - ఎంత కష్టపడి పనిచేసేదీ!

తాను కూడా ఈ పుండుతోనే పోతాడో ఏమో! ఎన్ని ఆకులు కట్టినా ఎన్ని పసర్లు పోసినా, ఈ పుండు భయపడడం లేదు.

మెల్లిమెల్లిగా మట్టిని తీసేసాడు. పుండులోంచి రసి కారుతోంది. చేపల జిహ్వాచాపల్యం ఆ బాధని అధిగమించింది. మడుగు చేరాడు.

పలచగా కాచుకున్న జొన్న అంబలిలా కదిలీకదలనట్టు ప్రవహిస్తున్నాయి. నీళ్ళు పైనించి ఎక్కడో రాళ్ళకు ఢీకొంటున్న నీళ్ళ గలగల విన్పిస్తోంది.

ఉత్తరాన ఉన్న గుట్టమీద పుట్టి అడవిలో చొరబారి ప్రాణహితలో కలవడానికి పరుగులు పెడుతున్న వాగు అక్కడ కొంత మడుగుగా వుంటుంది.

మట్టికాలు నీళ్ళలోకి దించాడు. పుండుకు అంటిన మట్టి మెల్లమెల్లగా కరిగిపోతోంది. ఏదో కొరికినట్టయి చటుక్కున కాలు పైకితీశాడు. చేప చెంగున నీటిలోకి దూకింది.

అరెరె! చిటికలో తప్పిపోయింది. అనుకుంటూ పిక్కలోతు నీళ్ళలోకి నడిచాడు. కాలును మళ్ళీ ఏదో కొరికినట్టు కాగానే కాలు అలాగే వుంచి చటుక్కున చేతుల్తో చేపను పట్టుకున్నాడు. తీసి ఈడ్చి ఒడ్డు కేసి చరిచాడు. దాని తల భూమికి తాకి తోక ఆడిస్తూ అక్కడే చతికిలబడింది.

ఏదో మెరుస్తూ నీళ్ళల్లో పరుగుపెడుతోంది. 'పెద్ద పాపరకూన' అనుకుని రెండంగలలో దొరకబుచ్చుకుని ఒడ్డు మీదికి విసిరేశాడు. అదేదో విషపు పాములా వుంది. జరజరా పాకుతూ గడ్డిలో కల్సిపోయింది. అది పామని, కాటేస్తే పోయేవాడేనని తెలిసి భయంవేయలేదు. ప్రమాదాలు వారి నిత్యజీవితంలో కోకొల్లలు. పైపెచ్చు అది పాపరకూన కానందుకు విసుక్కున్నాడు.

జెల్ల చేప కోరలు పుండులో దిగబడి లాగుతుంటే శరీరమంతా బాధతో విలవిలలాడిపోయాడు. అయినా వదల్లేదు. అలా చాలినన్ని చేపలు పట్టుకుని సొరకాయ బుర్రలో వేసికొన్నాడు.

రసితో నీచు వాసన వేస్తున్న పుండంతా కొరికినట్టు అయింది. నీళ్ళలో నానిన పుండు పుర్రెలోంచి అపుడే తీసిన మెదడులా నెత్తురు చారికలతో మరీ పచ్చి అయింది.

ఎడంకాలు పుండువల్ల కాలు చాపి ఒంటికాలి మీద దొడ్డికి కూర్చున్నాడు. ఆకులతో తుడుచుకుని గోచీ పెట్టుకుని, చేపలు తీసుకుని పాకకు బయల్దేరాడు.

ఓసారి నూనె అమ్మవచ్చిన షావుకారు యిది చూచి తనని అనాగరికుడని ఎద్దేవా చేశాడు. చేతికి అంటకుండా అశుద్ధాన్ని ఆకులతో తుడిచేసుకోవడం కన్నా చేతికి అంటుకునేట్టు అశుద్ధాన్ని కడుక్కోవడం ఎలా గొప్పదో? అది అప్పటికి ఇప్పటికి యిస్రూకి అర్థంకాని విషయం. వాళ్ల గూడెంలో వాళ్ళంతా యిదేపని చేస్తారు కదా !

నడుస్తూ, నడుస్తూ అక్కడక్కడ కన్పించిన 'నన్నెగడ్డల్ని' (వుల్లిగడ్డ, కందిగడ్డల్ని పోలి ఉంటాయి) పెళ్ళగించి పంచెలో వేసికొన్నాడు.

'ఓయా' అని నాల్గుదేవర్ల కటిసిడం నడిమెక్ నిత్తం కేక వేయడంతో ఏంటన్నట్టు ఆగిపోయాడు.

కటిసిడం నడిమెక్ ది యిస్రూ పక్కగూడెం. చేను ఈ తోవకే కొంత లోపలికని ఉంటుంది. నాల్గుదేవర్ల వాళ్ళు తాబేలు తినకూడదని ఆచారం. తాబేలు యిచ్చి చేపలు తీసుకుపోదామని వచ్చినట్టున్నాడు కటి.

తాబేలును పొతం చేయడం చాలాపని. చేపలైతే యిట్టే కాల్చుకుని తినేసేయవచ్చు. కటి మాటల్లోకి దించాడు.

దసరా ఇంకా కొద్దిరోజులే ఉంది. అహిరి మహరాజ్ కొలువులో దసరా ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతాయి. అహిరి, సిరొంచ, ఏటిపల్లి తాలూకాలలోని గోండులంతా ఆ ఉత్సవాలలో పాల్గొనడానికి చేరుతారు.

అయితే ఎవరి భత్యం వాళ్ళే తెచ్చుకోవాలి. పైపెచ్చు వచ్చినవాళ్ళే అహిరి

మహరాజ్‌కు మేకలు, డబ్బులు కానుకలుగా సమర్పించుకుంటారు. రెండు రోజుల ఆ ఉత్సవాలలో పాల్గొనడానికి మరి రెండు రోజులముందే బయలుదేరాల్సి ఉంటుంది. మహరాజ్‌కు సమర్పించుకోవడానికి ఒక మేకను అట్టేపెట్టాడు కటి. అలా అనేక విషయాలపైకి మళ్ళింది సంభాషణ.

ఆ పండగ రెండు రోజులూ తన సరసకు వచ్చేవారికోసం పూసలు, యితరత్రా కొనిపెట్టడానికోసం డబ్బు కూడబెడుతున్నాడుకూడా. కటి భార్య ఇటీవలే పోయింది. ఆ పండుగ రోజులలో ఆపాటి లైంగిక స్వేచ్ఛను ఆ గూడేల్లోని వారు అనుభవి స్తుంటారు. మహరాజ్‌కు యిస్రూ ఏం కానుకలు తీసుకుపోవాలనుకుంటున్నాడో తెలుసుకోగోరాడు కటి.

'ఏమో చూద్దాం' అని ఆలోచనలో పడిపోయాడు యిస్రూ.

ఏటా మహరాజ్‌కు మేకలైతే సమర్పిస్తున్నాడు కానీ మహరాజ్ తమ బాగోగులు గురించి ఒక్కనాడూ వచ్చి చూసింది లేదు.

బొంగు కొట్టే కూలి, తునికి ఆకు తెంపే కూలి పెంచడానికి సర్కార్‌తో లడాయి చేస్తున్నానంటాడు ప్రతిసారి. కాని అయిదేళ్ళ నుంచీ అదే కూలీ యిస్తున్నారు. మహరాజ్ నేను మీవాణ్ణి మనమంతా ఒకే జాతి – 'గోండు జాతి' అంటుంటాడు ప్రతిసారి. మహరాజ్ దర్శనం, మహరాజ్ మాటలు ఎందుకో మొక్కుబడిగా మారినట్టనిపించింది యిస్రూకు.

మోతీ మాత్రం క్రమం తప్పకుండా వెళ్ళాల్సి ఉంటుంది. వెళ్ళకపోతే తమ గూడెం పటేల్ కుర్దుగాయితల్ ద్వారా పదిరూపాయలు దండుగ మహారాజ్‌కు పంపించాల్సి ఉంటుంది.

మగవాళ్ళు వెళ్ళకపోతే ఏమీలేదు కానీ ఆడవాళ్ళు మహారాజ్ కొలువుకు తప్పక వెళ్ళాలి. వెళ్ళి నాట్యం చేయాలి. లేకపోతే దండుగ కింద పదిరూపాయలు ఇవ్వాలి.

మోతీ వెళ్తే ఏసూ వెళ్తానంటాడు. వాడికి అక్కడ లకింబాయి కన్పిస్తుంది కదా! కాని చెల్లెలుకు తోడుండాలి కదా ! సోకు చూపుతాడేమో ! కానీ ఈ చేను కాపలా తన ఒక్కడితో అయ్యేపనేనా ? చేతి కొచ్చిన పంట ! ఆగం కాదూ ! ఎవరినీ పోనిచ్చేది లేదు.

అదీ గాక తన వద్ద ఏవీ డబ్బులు! ప్రస్తుతం మూడు రూపాయలు మాత్రమే ఉన్నాయి. పంట ఇంటికొచ్చి బొంగు కొట్టడం ప్రారంభించేదాక తనకు ఏవిధంగానూ డబ్బు అందే అవకాశం లేదు ! ఏం చేయనూ ! ఏమోలే ! ఎప్పటి సంగతి అప్పటికి ! ఏమనుకుంటాడో !

కొన్ని చేపలు పెట్టి తాబేలు తీసుకుని నడుస్తున్నాడు యిర్రూ. నడుస్తునే పాక మీదికి మనసు పోయింది.

మోతి జొన్న అంబలి కాసే ఉంటుంది. పోగానే చేపలు కాల్చుకుని అంబలి తాగుతూ అంచుకు నన్నెగడ్డలు, చేపలు కరకర నములుతుంటే ! ఓహ్ ! ఎన్ని రోజులైంది నీసు తినక ! చేనులోకి పరుగెత్తుకొచ్చిన చెవుల పిల్లిని తిని వారం రోజులయింది. ఈ మధ్య యేదీ దొరకకపోయె ! అబ్బ ! నీసు తినక వారం గడిచిందీ !

జొన్న గడుక వేసుకుని నూనె వేసి వండిన చేపలు తింటె అదే తమకు గొప్ప భోజనం. నూనెకు పైసలు కావాలి, నూనె వాడాలంటె ఇంకెన్ని రోజులు గడవాలో ! ఈ అంగీ చిరిగిపోయింది. మరో అంగీ కుట్టించుకోవాలన్నా ఎంత కాలం ఆగాలో !

❄ ❄ ❄

అలా తమ బతుకూ జీవన స్థితిగతులూ ఆలోచిస్తు జొన్నచేను చేరాడు యిర్రూ. తన ఊహలన్నీ తలకిందులు కావడంతో పై ప్రాణం పైనేపోయింది. పాక వాతావరణం అంతా మారిపోయింది.

పాకలో ఫారెస్టు అధికారులు తిష్టవేసి కూర్చున్నారు. ఏసును పారిపోకుండా గుంజకు కట్టేశారు. బాగానే కొట్టినట్టున్నారు, శరీరంపై కొట్టినచోటల్లా దద్దు తేలింది.

అంబలి కాసిన కుండ తన్నుతో వక్కలైనట్టుంది. ఒలికిపోయిన అంబలి తాగడానికి గండుచీమలు బారులు తీరాయి. పైన ఉన్న గడుకముల్లె కర్రతో కొట్టడంతో మంచంలోని గడ్డిలో కారిపోయింది. మోతీని కొట్టినట్టున్నారు. ఏడ్చి ఏడ్చి చెంపలు కన్నీటితో ధారలు కట్టాయి.

అదంతా జీవితంలో భాగమైపోయింది. అందుకే కొద్ది క్షణాల్లో తేరుకున్నాడు.

అరె! మేకలేవీ ! అతృతగా జొన్నచేను వేపు చూశాడు. చేనుని పాడు చేయలేదు నయం. కానీ మేకలేమైనట్టు ?

వచ్చిన వాళ్ళే యిస్రూ దాచుకున్న ఇప్పసారాని బాగా తాగినట్టున్నారు. పాకలో గుప్పున వాసన విసిరి కొడ్తోంది. గుడిసె పైకప్పు కూడా కొంతపీకి కుప్పేసినట్టున్నారు. పెద్దపులి కొట్టిన ఎద్దులా ఉంది వాతావరణం.

ఇస్రూని చూడ్డంతోనే మాటా పలుకూ లేకుండానే జంతువులా అరుస్తూ కర్ర పుచ్చుకొని పైన పడ్డాడొకడు. ఆ దెబ్బలు కాచుకొంటుంటే సొరకాయ బుర్ర పగిలిపోయింది. చేపలు చెల్లాచెదురయ్యాయి.

కళ్ళలో నీళ్ళు తిరిగాయి. పుండు మీద దెబ్బ తాకి విలవిలలాడిపోయాడు ఇస్రూ. బాధగా గుండెలవిసిపోయేట్టు అరిచాడు.

అప్పుడు నోరు విప్పారు అధికారులు. "ఇంతసేపటిదాకా ఎటు పోయినవురా! నీకోసం ఎంత సేపని పడివుండాలెరా." తిట్ల దండకం ప్రారంభించారు.

రిజర్వు ఫారెస్టులో మేకలు అక్రమంగా మేస్తున్నందుకు వాట్ని జప్తు చేసినట్టు, ఆ పాకకు కట్టె కొట్టినందుకు దండుగ, ఫారెస్టు భూమిలో జొన్న వేసినందుకు ఏటా ఇచ్చే మామూలు అన్నీ కలిపి తన మీద మోయలేని భారం మోపినట్టు ఆ తిట్ల దండకం ద్వారా అర్థమైంది ఇస్రూకు.

ప్రతియేటా ఇలా దౌర్జన్యం చేస్తున్నారని ఈసారి వర్షాకాలం పూనక ముందే తునికి ఆకు కూలీ పైసలొచ్చాక అందరు జమ చేసి కుర్ధుగాయతల్ చేతిమీదుగా ఇచ్చారు.

అతను కుర్దుపటేల్ వద్దకు డబ్బు తీసుకుని పోయినపుడు తాను కూడా ఉన్నాడు. నిండు గడ్డం, బోడమీసం, మేక నమిలినట్టుగా ఎపుడూ దౌడకాడ పాన్, ఉర్దూ, తెలుగూ, గోండూ కలిపి కొట్టేస్తుంటాడు.

వీడేమో ఎర్రబుర్ర మీసాలవాడు. అంటే పాతవాడు బదిలీ అయిపోయాడా! దిమ్మెక్కిన తల అదపులోకి వచ్చిన ఎంతసేపటికి గానీ ఈ ఆలోచన రాలేదు.

కుర్దు మాత్రమే ఇవన్నీ మాట్లాడగలడు. అన్ని కుర్దుకే తెలుసు. 'ఓయా' అని యేదో కేకవేయబోతూ మరో వేపు వెళ్ళడానికి అడుగు ముందుకేసాడు.

తమ మీదకు దాడికి పిలుస్తున్నారనుకున్నారు వాళ్ళు. భయంతో 'అరవకు' అని హెచ్చరించారు.

మోకాళ్ళ మీద నిలబడి అందరి కాళ్ళు పట్టుకున్నాడు. అసహ్యించుకుంటూ కసిరారు వాళ్ళు.

"నాన్నా ! వీళ్ళు మనలనెందుకు కొడుతున్నారు ? ఏం తప్పు చేశామని" బాధగా గోండు భాషలో అడిగాడు ఏసు.

"భాషలో మాట్లాడకురా !" అంటూ అధికారి పళ్ళు కొరికాడు. ఏసుకు యేదో చెప్పాలనుకున్న ఇస్రూ నోరు అలాగే మూతపడింది.

'మేకపట్టి' పోకపట్టి మామూలు కలిపి మొత్తం యాభైరూపాయలు జుర్మానా ఇవ్వాలె ! రెండు రోజుల్లో ఇవ్వకపోతె మేకలు జప్తు మాత్రమే కాదు ! జొన్నచేను కూడా దక్కదు.' హెచ్చరించారు వాళ్ళు. అదేమాట మళ్ళీ హెచ్చరించారు.

యాభై రూపాయలంటే మాటలా! యాభై ! ఉన్న ఫళంగా యెక్కడ్నించి వస్తాయి? యాభై ఇచ్చినా జప్తు చేసిన మేకలలో ఒకటో రెండో స్వాహా చేసి మిగిలినవే ఇస్తారు కదా! పంటైనా దక్కాలంటే యాభై ఇవ్వక తప్పదు.

'రేపటి నుండి కంకబొంగు కొట్టండి. ఈ జుర్మానా అందులో కోసుకుంటాం. ఈ ఒక్కసారికే యీ అవకాశం రా ! ఆఁ !'

వాళ్ళు సమస్యను సృష్టించారు. పరిష్కరించారు. వాళ్ళొచ్చిన అసలు కారణం వివరించడానికి ఇంత ప్రాతిపదిక కావాల్సి వచ్చింది.

ఇస్రూ జవాబుకు ఎదిరిచూడకుండానే వెళ్ళిపోయారు.

త్వరలో వర్షాలు తగ్గుముఖం పడ్తాయి. ఇక బొంగు కట్టె పని ప్రారంభమౌతుంది. కొట్టుకుపోయిన మట్టిత్రోవలు బాగు చేస్తారు. మంచి రోడ్డునానుకుని ఉన్న గూడేలలో ఇంతకంటే హీనం. వాళ్ళ కుటుంబంలో సగం మంది విధిగా బొంగు కొట్టడానికి వెళ్ళాల్సిందే. పేపరు మిల్లు నిరాటంకంగా నడవాలంటే ఫారెస్టు అధికారులు తీసుకునే చర్యలలో ఇది ఒకటి. వారి పొలాలు, చేన్ల కాపలా గూర్చి ఎంత మొత్తుకున్నా ఫలితం శూన్యం. విధిగా బొంగు కొట్టాల్సిందే. తమ గూడేలు మరీ లోతట్టుకుండడం వల్ల తాము బతికి పోయారు.

తోవ సాపుగా ఉన్న అడవిలో నుండి లోతట్టుకు పోదామని మరీ పట్టుపట్టి కుర్దు చచ్చిపోయిన పెద్దన్న యిక్కడ గూడెం పెంపొందించాడు.

ఇక్కడి నుండి కూడా కాగితం పరిశ్రమకు బొంగు సరఫరా కావల్సిందే. అయితే దసరాకు కొంచెం అటూ యిటూగా ఈ పని ప్రారంభమౌతుంది.

మహారాష్ట్ర ప్రభుత్వం తన రిజర్వు ఫారెస్టు నుండి కొట్టించిన బొంగు పరిశ్రమలు అభివృద్ధి చెందాలి అనే నెపంతో అతి తక్కువ (సబ్సిడీ) ధరకు ఆ మిల్లుకు సరఫరా చేస్తుంది. పేపరు రేటు మీద మాత్రం ప్రభుత్వం పరిమితి విధించలేదు.

ఈ పేపరుమిల్లు మరి పదిహేనేళ్ల తర్వాత నడపడానికోసం అని ప్రభుత్వం అడవి నరకడం ప్రారంభించింది. అడవి నరికి వ్యవసాయ యోగ్యం చేసికొన్న భూముల్ని పైసా ఖర్చు లేకుండా గోండుల్నించి ఆక్రమిస్తారు ఫారెస్టు అధికారులు. అక్కడ కలప బొంగు ప్లాంటేషన్ను ప్రారంభిస్తుంది ప్రభుత్వం.

అలా పోడు వ్యవసాయం తరిగిపోయి ప్లాంటేషన్ అభివృద్ధి చెందుతున్నది. అలా ఎప్పటికప్పుడు నిరాశ్రయులైన గోండులు స్థిర వ్యవసాయం చేసుకోవడానికి నెట్టివేయబడ్డారు.

అలా అడవి నరికి వ్యవసాయం మొదలుపెట్టి రెండు మూడేళ్ళు దున్ని రాళ్ళేరి పంట తీస్తూ మంచి భూమిగా తయారు చేసేసరికి ఫారెస్టు అధికారులో, దొరలో ఆ భూమి తమదని వస్తారు. వారిని తిరిగి యధాపూర్వ స్థితికి నెట్టి వేస్తుంటారు.

దొరలంటే ఒక వర్గమే కాని ఒక కులం కాదు. అంకిస ప్రాంతంలో వెలమదొరలు, సిరొంచలోనైతే ముస్లిందొరలు, మిగతా చోట్ల పటేళ్ళు, సర్పంచులు మరికొన్ని చోట్ల షావుకార్లు.

పెల్లుబికిన కన్నీరు కనుగుడ్లలోనే యింకిపోయింది. ఇక్కడితోనే అయిపోయిందా! తమ జీవితాలలో యింకెన్ని బాధలు అనుభవించాల్సి ఉందో ! పెద్ద దేవునికి, మహంకాళమ్మకు ఏం మొక్కులు తక్కువ చేశామో ! తమ మీద యింత నిర్దయ, కోపం ప్రదర్శిసున్నారు. ఈసారి పంట కోత ముందు జరిపే పండుగలో బాగా మొక్కులు తీరుస్తాం! మమ్మల్ని రక్షించు తండ్రీ –

అంతదాకా ఓపికపట్టు తల్లీ !

ఏసు కట్టు విప్పాడు యిస్రూ. కూరలు వుడికించే కుండలో నీళ్ళు పోసింది మోతీ. ఆ నీళ్ళే అంబలి రంగులో ఉన్నాయి. ఆ నీళ్ళలో అంబలి కాయడం మొదలెట్టింది.

కట్లతో బిగుసుకుపోయిన కండల్ని రుద్దుకున్నాడు ఏసు. పాకముందు పొడవాటి బొంగుకు పై కొసన కట్టిన కత్తి – మేకలకు చిగురుకొమ్మల్ని కోసే కమ్మకత్తి అపుడే విచ్చుకున్న మబ్బుల లోంచి వచ్చి వర్షిస్తోన్న వెలుగుకి నల్లగా మెరుస్తోంది.

దాన్ని చేతిలోకి తీసుకుని తండ్రి వేపు చూశాడు ఏసు. దాంతో ఒక్కొక్కడి తల తెగవేయడానికి అనుమతివ్వు అని తండ్రిని అడగడం లేదు కదా ఆ చూపులు!

ఇస్రూ అదేమీ గమనించడం లేదు. మంచంలో ఒలికిపోయిన పొడిగడకను మంచం కింద గుడ్డ పరిచి మంచంలోని గడ్డిని మెల్లగా లేవనెత్తి కిందకు వాల్చుతున్నాడు. గడకతో పాటు గడ్డిరెల్లు కూడా రాలుతోంది.

తెల్ల బట్టల వాళ్ళంటే చిన్నప్పటి నుంచీ మోతీకి ఎందుకో తగని భయం. నాన్న కూడా వాళ్ళని చూస్తే భయపడతాడుకదా ! కుర్దుగాయితల్ (గూడెం పెద్ద) వాళ్లకు వంగి వంగి దండాలు పెడతాడు. ఎంతో మర్యాద చేస్తాడు.

ఎప్పటివలెనే ఈ రోజు ఉదయం అంబలి కాసి యింత తాగి మేకల్ని తీసుకుని కచ్చా బాట వెంట కమ్మ కత్తి తీసుకువెళ్లింది. ఏదైనా కాయో పండో తనకూ దొరకచ్చని ఆశపడింది. ఆ బాట వెంట తెల్లబట్టలవాళ్ళు రావడంతో భయంతో పాకకు పరుగెత్తుకొచ్చింది.

అన్న అంబలి అలా గిన్నెలో పోసుకున్నాడో లేదో వాళ్ళు గిన్నెనీ అంబలి కుండనీ ఒక్క తన్నుతన్నారు. నోటికాడి బుక్క ఎగరగొట్టినందుకు అన్న ఎదురు తిరిగాడు. వాళ్లు నలుగురు అన్న ఒక్కడు. అన్నని చితకదన్ని గుంజకు కట్టేశారు. పాకంతా వెదికారు. చిందరవందర చేశారు. మంచం కింద గడ్డికుప్ప కింద దాచిన సారా వెతికి పుచ్చుకున్నారు. పంటల పండుగ కోసం తన తండ్రి దాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నాడు. అంత సారా ! మొత్తం గుటకాయ స్వాహా చేశారు.

ఎర్ర బడ్డ కళ్ళతో తనని చూస్తుంటే ఎంత భయం వేసిందీ ! ఎటైనా పారిపోవాలనిపించింది. కాని అన్నను ఎక్కడికైనా తీసుకుపోతే తెలిసేది ఎలా ? ఏం చెయాలో తోచక బిక్కుమంటూ అలాగే ఉండిపోయింది.

యిస్రూ అవేవీ గమనించడం లేదు. జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడం ఎలా! అని ఆలోచిస్తున్నాడు. ఏం జరిగింది ? ఎలా జరిగిందని అడగలేదు. ఏదో ఒకలా ప్రారంభమై యిలా జరగడం తమ జీవితం లో భాగమైపోయింది. అడగనందుకు ఏసూ చెప్పనూ లేదు.

తాబేలు తప్పించుకుని పారిపోయింది. చేపల్ని వెదుకుతోంది మోతీ.

'రాత్రి కుర్దుగాయితల్‌ని గూడెంకు రమ్మను' గడక రాలుస్తూనే ఏసుకు పని పురమాయించాడు.

గుర్రుగా తండ్రివేపు చూసి కసిగా అడుగులు వేసుకుంటూ కుర్దు చేనువేపు వెళ్ళిపోయాడు ఏసు.

❄ ❄ ❄

ఆనవాయితీ ప్రకారం ఆ రాత్రి కుటుంబ పెద్దలంతా ఆ గూడెంలో సమావేశమయ్యారు. సమస్య వచ్చినప్పుడల్లా సమావేశం కావడం వారి ఆనవాయితీ.

అందరికీ అదే సమస్య. రేపటి నుండి బొంగు కొట్టడానికి అందరూ వెళ్ళాలని వుత్తర్వు. కనీసం ఇంటికొకరైనా ఈ పంట కోతల దాకా వెళ్ళాలి. కోత కొచ్చిన పంటల్ని విడిచి ఎలా వెళ్ళడం అన్నదే సమస్య. ఆ సమస్య కొత్తది కాదు. ఏటా ఎదుర్కొనేదే. అయినా ఏటా కొత్త సమస్యలాగే.

వెలుతురు కోసం నెగడు రాజేశారు. పుల్లలు ఎగదోస్తుంటే మంటతో లేస్తున్న మిరుగుళ్ళు చెల్లాచెదురుగ వెలిగి ఆరిపోతున్నాయి.

మూడు నెలలుగా ఆ గూడెంలో ఎవరూ లేకపోవడంతో నిర్మానుష్యంగా పాడుపడియిపోయాయి గుడెసెలు. ఆ గూడెంలో యిరవైవరకు ఉంటాయి గుడిసెలు. ఇరవై మంది దాకా జమయ్యారు.

నెగడు చుట్టూ కూర్చున్నారు. ఏటా యిదే పాటనా ! దీనికి విరుగుడు లేదా!

అందరి మనస్సుల్లోనూ ఇదే భావం. కానీ ఏం చేయాలో ఎవరికి తోచడం లేదు.

'ఈ పుల్లర కచ్చినోనికల్ల కొత్తగ కట్టుడెట్ల ?' భీము తన అసమ్మతి తెలియజేశాడు.

'నిజమే గని ! నాకు మాత్రం కట్టాలని వుందా ! మరేం జేద్దాం.' కుర్దుపటేల్ అడిగాడు.

తను గూడెం పెద్ద. ఈ గూడెం మర్యాద కాపాడాల్సిన బాధ్యత తనది. దొరలకు, ఈ అధికారులకు ఏది చేరాలన్నా తన చేతులమీదుగా వెళ్ళాల్సిందే. వచ్చి పోయే ఈ అధికారులకు విశ్రాంతి గృహం వేయించాల్సిన బాధ్యత కూడా తనదే. విశ్రాంతి గృహంలో ఏడాదిలో ఏ కొద్దిరోజులో వచ్చి ఉన్నా తమ పాకల కంటె విశాలంగా అందంగా వుంచాలి. లేకపోతే వారికి కోపం వస్తుంది. ఆ కోపం తమ జీవితాల్ని భస్మం చేస్తుంది. వారికి కోపం రాకుండా చూడాల్సిన బాధ్యత తనది.

ఏం జేద్దాం అంటే ఎవరు మాట్లాడలేకపోయారు. ఎగవెడ్తే ఎంత బాగుంటుందని అందరి తలల్లోనూ ఉంది. కాని ఎవరూ అంత మాట అనడానికి సాహసించలేకపోయారు.

'నేను బొంగుకొట్టటానికి పోతె ఇగ ఏసు కావలిగాసినట్టె, పంట చేతికొచ్చినట్టేయిగ' యిస్రూ ఏసు నిద్దర మొహాన్ని గూర్చి చెప్పాడు.

'ఏసునే తోలియ్యి ! వాళ్లను నేను సముదాయిస్తా' కుర్దుపటేల్ రాజీ కుదిర్చాడు.

అలా నామమాత్రపు కూలీకి అందరూ తలవంచారు. అది కూలిపని అనడం సరికాదు. వెట్టిచాకిరీ.

తీసుకుపోయిన వారి మేకలు విడిపించుకు రావడానికీ కుర్దు బాధ్యత తీసుకున్నాడు.

'వీళ్ల పీడ యిగ మనకు వదలదా ?' ఎవరో అడగనే అడిగారు.

'దసరా వత్తున్నదిగద, ఈ సారి అహిరి మహారాజ్‌కి యివన్ని చెప్పకోవాలె.' రాజయ్య అన్నాడు ఆశగా.

'అవు ! యాల్లకు యాది జేసినావు. ఈసారి దసరకు అహిరి మహారాజ్ కాడికి రాని ఆడిబాయిలు పదిరూపాయలు పట్టి గూడ యియ్యాలో రేపో యియ్యాలె ! మీరే తీసుకచ్చియియ్యాని మరి ! లేకపోతె గూడెం మర్యాద పోతది.' అంటూ అందరినీ ఎవరెవరు వస్తున్నదీ లేనిదీ వాకబు చేశాడు కుర్దు.

'నీ సంగతేంటి యిస్రూ ! మోతీని పంపిస్తావా ? పంపిస్తే కావలి కష్టం అయితది! నిజమే ? ఏం జేస్తవు ?' అడిగాడు కుర్దు.

పదిరూపాయలు ఉన్నఫళంగా ఎక్కణ్నించి తేగలడు తాను ?

'దాన్ని నేనే తీసుకువస్త ! చుక్కబొట్లు పొడిపించాలె ! అన్నాడు యిస్రూ.

'మరి కావలి ఎట్ల ?' కుర్దు సందేహించాడు.

'అందరు ఆ రెండ్రోజులు బొంగుకొట్టుడు బందు వెట్టాలె.' ఈమాట అందరికీ నచ్చింది.

రాజుకున్న నెగడు నివురు గప్పింది. ఆ రాత్రి ఎవరి చేనులలోకి వారు వెళ్ళిపోయారు.

ఎక్కడో చిన్న కలకలం విన్పించింది. అందరూ అటుచూశారు.

❄ ❄ ❄

ఆ రోజు పంట కోతల పండుగ. పంట చేతికి వచ్చేముందు పండుగ చేసుకోవడం ఆనవాయితీ. ఏ గూడానికి ఆ గూడెం మొత్తంగా ఈ పండుగ జరుపుకుంటారు.

రాత్రయింది. రెండు మూడు సార్లు వెలుతురుకోసం నెగడు మండుతోంది. వంటలు చేసేవాళ్ళు వంట చేస్తున్నారు. సాంప్రదాయక నృత్యం చేసేవాల్లు నృత్యం చేస్తున్నారు. యిప్పసారా తాగేవాళ్ళు తాగుతూనే ఉన్నారు.

అంతా స్వేచ్ఛగా ఎక్కడికక్కడ జరిగిపోతున్నట్టుగా వుంది. కాని గూడెం పూజారి ఈ ఉత్సవంలో ప్రధాన పాత్రధారిగా అది యిలా, ఇది యిలా అని పురమాయిస్తున్నాడు.

ఆ గూడెంలో పండుగ జరుపుకుంటారని ఏసు ద్వారా లకింబాయికి ముందే తెలుసు. ఆ సాయంత్రానికే ఆ గూడెం చేరింది. జాకెట్టు తీసేసింది. ఏసుతో ఆట

పాటల్లో పాల్గొంటోంది ఉత్సాహంగా.

అడవిలో ఏకాంతం, పచ్చని జొన్నచేను, మెచ్చిన పెనిమిటి. ఎంత మధురం! తన తండ్రి బాబూరావుమడె కూడా దసరాకు అహిరి వెళ్ళడంతో సరిపోయింది. తల్లికి తెలిసీ తెలియనట్టు ఊరుకుంది. తండ్రికి తెలిస్తే ఎంత రగడ అయ్యేదో !

ఇస్రూకు దసరా అనుభవం మాత్రం ఈసారి చేదుగా అనిపించింది. మహారాజ్‌కు మంచి మేక కానుకకింద పోయింది. ఎప్పటివలెనే ఫారెస్టు అధికారులు పీడ వదిలిస్తానని, కూలీలు పెంచడానికి లడాయి చేస్తానని, ఢిల్లీకి పోయి కొట్లాడేందుకు ఈ సారి వచ్చె ఓట్లపుడు కూడా తనకే ఓటేసి గెలిపించాలని మొక్కుబడి ఉపన్యాసం విన్నాడు. అదేమీ యిస్రూని సంతృప్తి పరచలేదు. మహారాజ్ ఏటా లడాయి చేస్తున్నా అనే అంటున్నాడు. తమ బతుకులు మాత్రం అలాగే ఉన్నాయి. ఆ కాస్త దానికి మేక పోగొట్టుకున్నందుకు విచారంగా ఉన్నాడు.

ఈ రోజు మరో మేక తెగింది. అది చాలుతుందో లేదో ! బాబూరావు మడె వస్తే ఎంత అల్లరి అవుతుందో ! కన్యాశుల్కానికి భయపడి కొడుక్కు తానే ఈ ఉపాయం నేర్పినట్లు తిట్టిపోస్తాడేమో ! ఎంత లడాయి అవుతుందో ! లడాయి రాజీకి వస్తే మరెంత సారా, మరెన్ని మేకలు కావాలో !

యిప్పసారా తాగుతూనే ఉన్నా యిస్రూని ఆవరించిన విచారం పోలేదు. అవన్నీ మరిచిపోవడానికి జోరుగా తాగుతున్నాడు.

జొన్నపంట మీద తీర్చుతానని తెచ్చిన నూనెలో వేయించి మోతీ మాంసం ముక్కల్ని యిస్రూ వద్ద పెట్టింది. ఆ పండుగ రోజు వంటలు కలిపిచేసినా, విడివిడిగా చేసినా అందరూ కలుపుకుని తినడం ఆనవాయితీ.

తల ఎత్తి కూతురివేపు ఆప్యాయంగా చూశాడు యిస్రూ. ఇపుడు మోతీ ముఖం ఎంత అందంగా ఉందీ ! ఎన్ని పచ్చబొట్లు పొడిపించాడు మొన్న ! ఇక దీన్ని పెళ్ళి చేసికోవడానికి ఎవడూ వంక పెట్టలేడు. అది చుక్కబొట్లు పొడిపిస్తుంటే ఏడుస్తుందేమిటీ! దీనికేం తెలుసు పిచ్చిపిల్ల ! పూర్నించి కొన్ని పూసలు కొనిచ్చాడు తాను. నెగడు వెలుతుర్లో అవి ఎంత బాగా మెరుస్తున్నాయీ !

ఆప్యాయంగా పక్కన కూర్చోబెట్టుకుని యిప్పసారా బలవంతంగా త్రాగించాడు యిస్రూ.

వాళ్ల గూడెం పటేల్ అన్మంతు మరో యిద్దరు పెద్దమనుషులు ఆగూడెం మీదికి లడాయికి వస్తున్నట్టుగా వచ్చారు.

అప్పటికే ఆలస్యమైందని గ్రహించారు. జాకెట్టు తీసేసిన లకింబాయి ఏసుతో కలిసి ఎగురుతోంది. వాపసు తీసుకుని పోదామనుకున్న వాళ్ళకి కోపం రెచ్చిపోయింది. బాగా రగడ చేశారు.

గూడెం పూజారి, కుర్దుపటేలు యిరుపర్గాలకు సంధి కుదిర్చారు.

'ఒక్క పూస లేదు ! ఒక్క చీర లేదు ! ససేమిరా వీల్లేదు !' అన్నాడు బాబూరావు.

పంటకోతలయ్యాక పూసలూ, చీరెలూ లకింబాయికి కొనిపెట్టడానికి పూజారీ, కుర్దు హామీ ఇచ్చారు. మళ్ళీ మరుసటి రోజే ఈ పెళ్ళి దావతు ఇవ్వడానికి నిర్ణయమైంది.

యిస్రూ లబోదిబో మొత్తుకున్నాడు. 'ఈ రోజు పండుగలోనే అందరం సర్దుకుందాం. మీ గూడెం వాళ్ళని ఈ రాత్రికే రమ్మనండి' అన్నాడు. అతడి మాట ఎవరికీ పట్టలేదు. వారికి పండగలంటే ప్రాణంకదా! వచ్చిన అవకాశం జారవిడుచుకొంటరా!

కొత్త సంసారానికి కొత్త పాక వేయడానికి సంతోషంగా అంగీకరించాడు. కాని మరుసటి రోజు పండుగకు మాత్రం సంతోషంగా అంగీకరించలేకపోయాడు.

మరుసటి రోజు పండుగ ఖర్చంతా యిస్రూమీదే పడుతుంది. మరో రెండు మేకలూ, ఐదు కుంచాల అనుములూ బదలు తెచ్చి ఖర్చుచేయాలి. షావుకారు వద్ద నూనె, ఉప్పు బాకీ మరింత పెరిగిపోతుంది.

ఆ పండుగ ఏసుకి ఎంత సంతోషంగా ఉందో తండ్రి యిస్రూకి అంతకంటే విచారంగా ఉంది.

❄ ❄ ❄

పట్టపగలే గూడెం నిద్రపోతున్నట్టుగా వుంది. ఎక్కడివాళ్ళక్కడ పనికి వెళ్ళిపోయారు.

జొన్న పంట చేరి ఆ గుడిసెలో ఒకే ఒక్క నిద్ర తీసింది. షావుకారు బాకీ కింద చెల్లుపోయాలి. రేపోమాపో పోద్దాంలే ! ఎటు పోతాయి ! ముందు

ఏసుకు గుడిసె వేయాలి ! అనుకుని అదే ప్రయత్నంలో ఉన్నాడు యిస్రూ.

నాలుగయిదు మంచి టేకుదూలాల్ని నరికి గుంజలు పాతారు. మొగురం టేకుదే. వాసాలుగా కంకబొంగు పరిచారు. గుడిసె చుట్టు గోడలా కంకబొంగులే పాతారు.

మిట్టమధ్యాహ్నం. మబ్బు విడిచిన ఎండ తీక్షణంగా కొడుతోంది. పనిచేసి అలసి కూలబడిపోయాడు యిస్రూ. లకింబాయి తెచ్చిన మంచినీళ్ళు తాగాడు.

మోతీ, లకింబాయి, ఆపని, ఈపనిలో సహకరిస్తూ అలిసి అలా ఆరుబయలు గుడిసె ముందు ఒరిగి కూర్చున్నారు.

ఏసు బొంగు కొట్టడానికి వెళ్ళిపోయాడు. గుడిసె పక్కన జొన్నసొప్ప కుప్ప ఉండడంతో త్రోవకు అడ్డంగా ఉండి ఏమీ కనిపించడం లేదు.

ఫారెస్టు అధికారులు అకస్మాత్తుగ కళ్ళబడేసరికి వణికి పోయాడు యిస్రూ. ఏం చేయాలో పాలుపోలేదు. లకింబాయి, మోతీ కూడా అలాగే శిలా ప్రతిమలై పోయారు.

దొంగతనంగా కలప కొట్టారని యధావిధిగా నానా రభస చేశారు. కాళ్ళు కడుపులు పట్టుకున్నాడు యిస్రూ.

ఎండకు యవ్వనంతో మెరుస్తున్న లకింబాయిపై వారి కన్ను పడింది. పాకలోని ఇప్పసారా దొరకబుచ్చుకుని మత్తుగా తాగి లకింబాయి పట్ల చాలా అవమానకరంగా ప్రవర్తించారు.

కోపం, దుఃఖం, నిస్సహాయత ముప్పిరిగొన్నాయి. తమని రక్షించండని కాళ్ళావేళ్ళాబడ్డాడు యిస్రూ.

యాభై రూపాయల జుర్మానా విధించి, కొద్దిరోజులు గడువిచ్చి వెళ్లిపోయారు. ఆ గడువులోగా చెల్లించకపోతే కంకబొంగు కొట్టే కూలీలో వంద కోసుకుంటామని హెచ్చరించారు.

ఏం చేయాలో తోచక తలపట్టుకు కూర్చున్నాడు యిస్రూ. లకింబాయి అవమాన భారంతో కుంచించుకుపోయింది. మోతీ భయంతో బిక్కచచ్చిపోయింది.

కోపంతో పిడికిలి బిగించిన గాలి స్థంభించింది. చెట్లు కడుపులో దాచుకున్న

కోపంతో గుండె ఎగపోస్తున్నా ఎంతో ప్రయత్నం మీద గంభీరంగా ఉండిపోయాయి.

గుంజకు కట్టేసిన మేకలు నోరు విప్పాయి. నోరులేని జంతువుల ఆక్రందన అడవంతా ప్రతిధ్వనిస్తోంది.

అది తమకు స్వాగతంగా ప్రవేశించారు రాజారావు దొర. నలుగురు సిబ్బంది (పోలీసులు) ని వెంట తెచ్చుకున్నాడు.

"నువ్వు దున్నిన చేను నా పట్టా భూమి". తన వాటా కోసం నిలదీశాడు.

అయోమయంలో పడిపోయాడు యిస్రూ. అది రిజర్వు ఫారెస్టు భూమి అని ఫారెస్టు అధికారులు పట్టీ పట్టుకుపోయారు. మళ్లీ ఇదేమిటి గొడవ ?

మోతీని పంపి కుర్దూకు కబురుచేశాడు. కుర్దూతో పాటు షావుకారూ కన్పించి గుండె బేజారైపోయింది.

సాయంత్రానికి అందరు జమ అయ్యారు. అందులో సగంమంది దున్నుతున్న భూమి తనదే అని దబాయించాడు దొర. ఏం చేయాలో వారికి పాలు పోలేదు. పంట చేతికొచ్చింది. ఇప్పుడేం చెయ్యాలి. ఇపుడు కాదంటే తన పొలంలో పంట కోసుకుపోయారని కేసుపెట్టి ఏళ్ళతరబడి కోర్టుల చుట్టూ తిప్పుతారు. నోటిదాకా వచ్చిన బుక్క చేజారిపోయినట్లైంది. కుర్దు ఎంతో బాధపడిపోయాడు.

తలాబస్తా చొప్పున పదిబస్తాల జొన్నలు ప్రస్తుతం ఇవ్వడానికి కుర్దు మధ్యవర్తిగా అంగీకరింపజేశాడు. అవి షావుకారునే తీసుకురమ్మని పురమాయించి వెళ్ళాడు దొర.

దొర బస్తా, దసరా పండుక్కోసం తీసుకున్న ముతకధోతుల జత కింద బస్తా జొన్నలు కొలుచుకున్నాడు షావుకారు. విందు సందర్భంగా ఇచ్చిన నూనె, ఉప్పు చిల్లర కోసం మరో బస్తా కొలిచాడు.

ఇంకా రెండు బస్తాల జొన్నలు మాత్రమే మిగిలాయి. ఇందులోంచే విత్తనాలకి కొన్ని ఉంచుకోవాలి. మిగిలినవి మళ్ళీ పంట చేతికొచ్చేదాకా తినడానికి ఏమూలకి సరిపోవు. రోజుకోపూట అంబలి కాసుకుంటే మాత్రమే బొటాబొటీగా సరిపోతాయి.

ఏదులు, ఎలుగుబంట్లు, ఇతర జంతువులు, ఉడుతలు, పిట్టలు ఎన్నింటి బారి నుంచి ఈ పంటని కంటికి రెప్పలా కాపాడారు తాము. నిద్రలేదు. సుఖం

లేదు. ఎన్ని కష్టాలు పడి ఈ పంట ఇంటికి తెచ్చుకొన్నారు. తన కళ్ళ ముందే తనది కాకుండా పోతోంది. ఇంకా యాభయి రూపాయలు ఫారెస్టు అధికారులకు యివ్వాల్సి ఉంది. తనకు తృప్తి అనిపించినమేరకు జొన్నలు కొల్చుకుని యాభయి రూపాయలిచ్చాడు షావుకారు.

మోతీ ఏడుస్తోంది. తనకేమీ వెట్టికివ్వడం లేదని కసిరాడు షావుకారు. ఏసు కోపాన్ని ఆపుకోలేక కడ్తున్న కొత్త గుడిసెను చిందర చేశాడు. షావుకారు ఇవేవీ చూడనట్టు తన పని తాను చేసుకుని వెళ్ళిపోయాడు. అడివి జంతువుల బారి నుండి అహోరాత్రాలు కాపాడిన జొన్న పంట ఆ మర్నాడు బండ్లమీద షావుకారు ఇంటికి చేరాయి. వచ్చిన యాభై రూపాయలు కుర్దు ద్వారా అధికారుల జేబుల్లోకి వెళ్ళిపోయాయి. ఏడ్వడానికైనా కళ్లలో తడి మిగలలేదు యిస్రూకి.

❄ ❄ ❄

అడవిలో కాస్తున్న ఎండకూడా చల్లగా వెన్నెలలాగే వుంది. ఎండ తగలకుండా ఆకాశమంత ఎత్తు ఎదిగిన వృక్షాలు వారికి గొడుగుపడుతున్నాయి. గాలికి అడివి అడివంతా కదులుతోంది. అపుడపుడు ఆకులొక్కోటి రాలుతున్నాయి. అక్కడక్కడ వనంలోని పురుగులరొద, వుడతల పరుగులు కిచకిచలు లయగా విన్పిస్తున్నాయి. ఆ వీస్తున్న గాలిలో వాతావరణం అడవిలా గంభీరంగా వుంది.

'నీవిక్కడే ఉండు కామ్రేడ్' అని సెంట్రి కామ్రేడ్‌కు చెప్పి దళ కమాండరు మిగతా అయిదుగురిని తీసుకుని నీటికాల్వ వేపు నడిచారు. అక్కడికి ఆ చెరువు దగ్గరే. వండుకున్న గిన్నెలు కడిగేశారు. కడుపు నిండా నీళ్ళు తాగి ఒక గిన్నెలో సెంట్రి కామ్రేడ్‌కు నీళ్ళు తెచ్చారు.

అందరికి కాళ్ళు పీక్కుపోతున్నాయి. మూడురోజుల్నించీ నడుస్తూనే వున్నారు. తలా 25 కిలోల బరువు మూటల్తో వడివడిగా నడిచి నడిచి వచ్చారు. అందులో చిన్నన్న యిటీవలే దళంలో చేరాడు. మానసికంగా సడలని ధృఢ దీక్షతోనే ఉన్నాడు కానీ శరీరం సహకరించడం లేదు. నడక యింకా అలవాటుకానట్టుంది. ఆకలికి మాడి మాడి తిన్నారో ఏమో ! కళ్ళు మూతలుబడిపోతున్నాయి.

కమాండర్ గొంతు సవరించుకుని చెప్పడం ప్రారంభించాడు.

'కామ్రేడ్ ! మనం ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్ని దాటేసి ప్రస్తుతం మహారాష్ట్ర

అడవులలో వున్నాం. అహిరి, సిరొంచ, ఏటపల్లి తాలూకాలు ఇలా అటు యిటూ వుంటాయి'. అంటూ భౌగోళిక స్వరూపాన్ని, రాజకీయ స్వరూపాన్నీ వివరించాడు.

'కామ్రేడ్ ! అంటూ నిద్రపోతున్న చిన్నన్నని పిలిచాడు. వులిక్కిపడి చూశాడు చిన్నన్న.

"ఈ తాలూకాలలో వరి, జొన్న, మిర్చి, పొగాకు, అనుములు, పెసరు ప్రధాన పంటలు. సిరొంచ ప్రాంతంలో ఆదివాసీలు, తర్వాత నేతకానివారు, ఆరెవారు ఎక్కువగా వున్నారు. ఈ రెండుకులాలు హరిజన కులాల పట్టికలో చేర్చబడ్డాయి. గౌడ తదితరులు కూడ కొద్దిగా పరుచుకుని వున్నారు.

చాలా గ్రామాలలోకి యింకా కరెంటు ప్రవేశించలేదు. ఇక్కడ అడవి జంతువులు కూడా ఎక్కువే ! మనకు శత్రువుతోపాటు యివి కూడా ఒకోసారి ప్రమాదాన్ని కలుగజేస్తాయి. ఈ అడవి జంతువుల్ని ఇక్కడి ప్రజలు చంపడానికి వెరుస్తారు, ఫారెస్టు అధికారులు పెట్టే కేసులకు భయపడి. మనుషులకు మాత్రమే రక్షణ లేదు. పశువుల్ని ఆ జంతువులు చంపితే పదో పరకో నష్టపరిహారం పేరిట వారి మొహాన కొట్టిపోతారు."

ఆగి చిన్నన్నవేపు చూశాడు కమాండరు, వింటూన్నావా అన్నట్టుగా. చిన్నన్న సర్దుకుని కూర్చున్నాడు. నిద్రమబ్బు వదిలిపోయింది. కమాండరు మళ్ళీ అందుకున్నాడు.

"అంకిస, అసరెల్లి, పెంటిపాక, అమ్రాజం లాంటి కొన్ని గ్రామాలలో చెరువులు, కుంటలున్నాయి. అక్కడ వరి ఒక్క పంట మాత్రం పండుతుంది. ఇపుడిపుడే బోరింగ్ బావుల వ్యవసాయం రాలేదు. మిగతా చోట్ల తిండి కోసం జొన్నలు పండిస్తారు.

ఇక్కడ గోండులలో రకరకాల శాఖా తెగలున్నాయి. చిన్న చిన్న తేడాల్తో అందరి జీవన సంస్కృతి ఒకటే. గోండులు ఎక్కువగా జొన్నగడుక తింటారు. లేదా జొన్నంబలి తాగుతారు.

అసరెల్లి, బొర్రాయిగూడెం చుట్టుపక్కల గోండులతో పాటు కోయ, మాల, మాదిగ, గౌడ కులాల వారు ఎన్నదగిన సంఖ్యలో ఉన్నారు.

ఈ ప్రాంతానికంతా కలిపి సిరొంచలో ఒకేఒక కాలేజీ ఉంది. అంకిసలో

పదవ తరగతిదాకా, అసరోలి, మద్దికుంట, అరడ, జనంపల్లి, జనగమారుల్లో ఏడవ తరగతి దాకా స్కూళ్ళున్నాయి. మిగతా గ్రామాలలో కొన్ని ఏకోపాధ్యాయ పాఠశాలలు రికార్డులలో మాత్రమే ఉన్నాయి.

అంకిస, సిరొంచలలో విద్యార్థులకు హాస్టళ్ళున్నాయి. అహిరిలో ధర్మరాజు మహరాజ్ ఉచితహాస్టల్ ఉంది. జనగనూరులో ఆశ్రమ పాఠశాల వుంది. మట్టిపై పుల్లతో పటం గీచి ఏరులూ, నదులూ, పల్లెలూ, రోడ్లూ సవిస్తరంగా వివరించాడు కమాండరు.

"ఇక్కడి ప్రజలు పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, లక్ష్మి దేవర మొదలయిన దేవుల్లకు మొక్కుతారు. దసరాకు అహిరి మహరాజ్ కొలువు తర్వాత ఈ ప్రాంతంలో పెద్ద జాతర మహంకాళి జాతర. అది ఏటా ఏప్రిల్‌లో జరుగుతుంది. అంకిసకు పక్కనే వున్న చింతరేవుల గ్రామంలో ఈ జాతర జరుగుతుంది. పనులు కూడా ఎక్కువగా వుండవు కాబట్టి దాదాపు అందరూ ఈ జాతరలో పాల్గొంటారు.

మనం తొలుత అహిరి, సిరొంచ, ఏటపల్లి, ఆలపల్లి, భుమాగౌడ్, కిష్టాపురం, జనగనూరు, రమేష్‌గూడెం, కమ్మనూరు మొదలైన ఈ చుట్టుపక్కల గ్రామాల్తో సంబంధాలు నెలకొల్పుకోవాలి.

ఇక్కడి స్కూళ్ళల్లో మరాఠీ మీడియంలో బోధించినా, హిందీ, తెలుగు సబ్జక్టులుంటాయి. ప్రజల్లో చాలా మందికి హిందీ, తెలుగు, మరాఠి, గొట్టె, కోయల భాషలు మాతృభాషతో పాటు వస్తాయి. అయితే అక్షరాస్యులు గ్రామానికి ఒకరిద్దరికి మించిలేరు.

ఇక్కడి గోండులు బుడ్డగోచి మోకాలిపైకి బిగించి కడ్తారు. తునికి ఆకుతో చుట్టలు చేసుకుని పొగాకు నింపుకుని తాగుతారు. నెత్తికి రుమాలు చుడుతారు కొందరు.

ధోతీ, హాఫ్ లుంగీ, లాగు కడ్తే వాళ్ళు గొట్టెవాళ్ళుగా మనం గుర్తుపట్టవచ్చు. ఆడవాళ్ళు సాధారణంగా మెడలో కుత్తికట్టుపూసలు వేసికొంటారు. అంటూ కట్టూ బొట్టు ఎలా ఉంటుందో పూసగుచ్చినట్టుగా వివరించాడు.

"ఇక్కడి గోండు ప్రజలకు పనికి కొరత లేదు. వర్షాకాలంలో పంటలు దీస్తారు. తర్వాత బొంగు కొడ్తారు. ఫిబ్రవరిలో యిప్పపూలు ఏరుకోవడం

వుంటుంది. ఆ తర్వాత తునికి చెట్టుకొమ్మల్ని నరకడం, కొత్తచిగుళ్ళు వచ్చాక తెంపడం యిలా పని చేతినిండుగా వుంటున్నప్పటికి కూలి రేట్లు తక్కువ కావడం, దొరల, అధికారుల, షావుకారుల దోపిడీకి అంతం లేకపోవడం వల్ల వీళ్ళ బతుకులు ఆదిలాబాద్ గోండులకన్నా ఏమీ మెరుగ్గా ఏమీ లేవు.

ఇక్కడి గిరిజనులు స్వంతంగా విప్పసారా కాచుకొంటారు. పోలీసులు ఇది సాకుగా దౌర్జన్యం చేస్తుంటారు. ఇక్కడ ప్రభుత్వ సంస్కరణలు, సంక్షేమ పథకాలు కలికానికైనా లేవు. ఆశ్రమ పాఠశాలలు హాస్టలు మినహాయిస్తే. కంట్రోలు సరుకులు వగైరా దొరలు, షావుకార్లు, సర్పంచులు పైపైనే కాజేస్తారు. గ్రామాల దాకా చేరవు. ఆవుగొడ్డు పుల్లర సనుగుకు యాభైపైసలు, మేకలకు సనుగుకు రెండు రూపాయలు పట్టీ వసూలు చేస్తారు. ఎంత చిన్న మందయినా ఏటా ఒకటీ అరా మేకలు లంచంగా యివ్వాల్సి ఉంటుంది. మధ్యమధ్య దాడులు చేస్తూ జరిమానాలు వసూలు చేస్తుంటారు. ఇక్కడి గిరిజనులు పేద రైతుకూలీలు మరీ అమాయకులు. తెల్ల బట్టల వాళ్ళంటే భయపడ్తారు.

మూఢ నమ్మకాలు జాస్తి. మనం చాలా జాగ్రత్తగా వారితో కలిసిపోవాల్సి వుంటుంది. అలా స్థూలంగా అక్కడి జనజీవనం పరిచయం చేశాడు కమాండర్. అందరు ఎంతో ఆసక్తిగా విన్నారు. ఇంకా వివరాలు చెపుతూనే ఉన్నాడు కమాండరు.

మూటాముల్లె సర్దుకున్న కూర్చున్నచోట ఆనవాలు లేకుండా చేశారు. బయలు దేరారు.

ఆకాశం ఉరిమిన చప్పుడైంది. సెంట్రీ పైకి చూశాడు. మబ్బులేమీ లేవు. అడవిలో వేసిన రోడ్డంట బొంగు లారీ రొద చేసుకుంటూ వెళ్ళిపోతున్నట్టుంది అల్లంత దూరంనించి.

కమాండర్ హెచ్చరించాడు మరోసారి. 'కామ్రేడ్స్! మనం శత్రువు చొరబడలేని దుర్గమారణ్యాలలో వున్నాం కదాని ఏమరుపాటున వుండకండి. మన ఆచూకీ శత్రువుకెట్టి పరిస్థితిలలోను తెలియనివ్వగూడదు.'

అలా అడవిలో నడిచి పొద్దుగుంకేవేళ ఆ గ్రామం చేరారు.

శీతల పవనాలు వీచడం ప్రారంభమైంది. అక్కడక్కడ నెగడు రాజేసుకున్నారు. కంచం చేతబట్టుకుని మరోచేత తింటూ ఏవో ముచ్చట్లు చెబుతున్నారు గూడెంతో.

కమాండరు కుర్దుగాయితల్‌ను జాడదీసుకుని కలిసారు. చాలాసేపు సంభాషణ జరిగింది.

కొద్దిసేపట్లోనే కుర్దు అందరినీ పిలిచాడు. కుర్దు ఇంటిముందున్న నెగడు చుట్టూ కూర్చున్నారందరు. కుర్దు వారిని గూడేనికి పరిచయం చేశాడు.

'మనకు బొంగు కొట్టేకూలి పెంచడానికి, తునికి ఆకు కూలి పెంచడానికి మన కష్టాలు పోగొట్టడానికి పెద్ద దేవరే వీళ్ళను మన దగ్గరికి పంపిండు. ఇక నుంచి మనతోనే వుంటరు వీళ్ళు మనతోనే తింటారు.'

కొందరు అనుమానంగా చూశారు. 'అహిర్ మహరాజ్‌ను కలిసి వచ్చిన్రా మీరు?" ఎవరో అడిగారు.

కుర్దు సముదాయించాడు. 'మొన్న దసరాకు మహరాజ్ ఏమన్నడు ? నేను ఎట్లైన కూలీలు బెంచెటట్టు చేస్త. నాకు వీలుగాకపోతె ఎవరినైన తోలిస్తననలేదా! మహారాజ్ వీళ్ళని తోలించి ఉండవచ్చు. మనకోసం ఎంతో దూరం నుంచి కష్టపడి వచ్చినోల్లను అనుమానించుడు మంచిదిగాదు. ఇదువరదాక అందరు మనను బెదిరించుక తిన్నోల్లే! కని ఈల్లు మనలను అడుక్క తింటారు. గది గదీ ! గమనించున్రి. వాల్లకు తిండి దొరకకనా? చూడపోతే అందరు సదువుకున్నోల్ల తీరు ఉన్నరు. వీల్లు మనకోసమే వచ్చిన్రు."

ఏసు కూర్చున్నకాడి నుంచి లేచి అన్న పక్కన వచ్చి చేరాడు. ఎగాదిగా చూశాడు. చేతిలోని తుపాకీ చూశాడు. ఆశ్చర్యంగా అలాగే చూస్తున్నాడు. కమాండర్ పలకరింపుగా చిరునవ్వు నవ్వాడు.

ఆ నవ్వుతో ఏసు బెరికితనం కొంత తగ్గింది. 'ఇదేంటిది'? ఆసక్తిగా అడిగాడు. తాను అవి దొరలవద్ద మాత్రమే ఇదివరకు చూసి వున్నాడు. వీళ్ళ వద్ద కూడా ఉండడం చూసి నమ్మలేకపోయాడు.

'తుపాకీ' అన్నాడు కమాండరు. చూడమన్నట్లుగా చూపాడు. లకింబాయి. మోతీ ఆసక్తిగా ఏసు పక్కన చేరారు. ఒక్కరొక్కరు అందరు వాటిని స్పర్శించి యిటూ, అటూ తిప్పిచూసి ఆనందపడిపోయారు.

యిస్రూ చలికి పుండు మరింత పగలకుండా ఏవేవో ఆకులు పేర్చి పాత గుడ్డ చుట్టాడు కాలికి. ఆకులు ఇంత లావుగా ఎబ్బెట్టుగా కన్పిస్తోంది. జారిపోయిన ముడివిప్పి తిరిగి బిగించి కడ్తూ అడిగాడు యిస్రూ.

'దీంతోని అడవి పందులు, ఏదులు చంపవచ్చునా!'

'చంపవచ్చు ! మనను చంపవచ్చే మనుషులను కూడా దీంతోటి చంపచ్చు' చిన్నన్న హుషారుగా చెప్పాడు.

'ఆం'.

అందరు తనివితీరా వాటిని తాకారు. ప్రేమగా నిమిరారు. కొంతసేపటికి కుర్దు మాటపై తలా కొంత వండిన గడుక తెచ్చి వారికి వేసారు. కారం గడుకతో ఆ రాత్రి వారి భోజనం.

తిని మళ్ళీ మాటల్లో పడ్డారు. ఎంతో రాత్రి దాకా ఏదో వొకటి మాట్లాడుతూనే ఉన్నారు.

అడవిగాచిన వెన్నెల ఆకాశాన్ని కప్పేసిన వృక్షాల్ని చీల్చుకొచ్చి అడివంతా పరుచుకొంటోంది. ఆ వెన్నెల్లో గూడెంలోని గుడిసెలన్నీ తడుస్తున్నాయి.

దారి దొరికినట్లనిపించిన ఏసు వింత వింత వూహలతో ఆ రాత్రంతా నిద్ర పోలేదు.

**కథా కాలం 1981; అరుణతార మాస పత్రిక, అక్టోబర్ 1984**

ఈ కథలో గిరిజనుల జీవిత చరిత్ర వుంటుంది. అడవిలో జంతువులు, పక్షులు, చెట్లుచేమలతో కలిసిన జీవితం ఉంటుంది. గిరిజనులు మీద షావుకార్ల దొపిడీ, మరొకవైపు ఫారెస్టు అధికారుల దోపిడి, పోలీసుల దురాగతాలు చెప్పనలవి కానివిగా వుంటాయి.

దోపిడీ పీడనల నుండి విముక్తి చేసే ఒక అద్భుతదీపం మా చెంతకు వచ్చిందనుకుంటారు. వారి అడవి జీవితాల్లో వెలుగు నిస్తుందనుకుంటారు. నక్సలైట్ అన్నలు వారి జీవితంలో కలగలిసిపోయారు. వారి జీవితాలలో మల్లెతీగలా అల్లుకుపోయారు. వారికి ఆశ్రయం కల్పించి వారిని తమ దేవుళ్ళుగా భావిస్తున్నారు.

**– నందిగామ నిర్మలకుమారి**

(ఎం.ఫిల్ నుండి)